క్లుప్తంగా

కానూరులో సంగీత శిక్షణ తరగతులు



పెనమలూరు: కానూరు కార్మెల్ మాత దేవాలయంలో ఫాదర్ శౌరి ఆధ్వర్యంలో సంగీతం శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కీ బోర్డు, రిథం ప్యాడ్, తబల అనుభవజ్ఞుడైన మాస్టర్ ఎల్.పుష్పనాథ్‌చే శిక్షణ ఇస్తామని ఫాదర్ శౌరి తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు టీవీలు, సెల్ ఫోన్‌లకు అలవాటుపడకుండా ఉండటానికి సంగీత కళను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వివిధ గ్రామాల నుంచి పిల్లలు వచ్చి సంగీత శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వచ్చి ఉచిత సంగీత శిక్షణ పొందాలని సూచించారు.

104 వాహన సేవలు ప్రారంభం



పెనమలూరు:ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నూతన 104 వాహన వైద్య సేవలను మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సాయిలలిత శుక్రవారం ప్రారంభించారు. గతంలో 104 సేవలు అందించిన సంస్థకు బదులుగా కొత్తగా దివ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 104 వైద్య సేవలు అందించనుంది. ప్రతి 15 రోజులకు ఒక సారి 104 వాహన వైద్య సేవలు గ్రామాల్లో అందుబాటులో ఉంటాయని సాయి లలిత తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జ్ ప్రసాదరాజు, డీఈవో కిరణ్,లావణ్య, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వాహన డ్రైవర్లు ఎం.రాజారావు, సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులు సక్రమంగా పని చేయాలి



గన్నవరం రూరల్:గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు డేటా వెరిఫికేషన్ సమర్థంగా పూర్తి చేయాలని గన్నవరం అగ్రికల్చర్ ఏడీఏ ఎం.సునీల్ ఆదేశించారు. ముస్తాబాద రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులు, రైతులతో ఆయన ఏవో వై.రజనితో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని, త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని చెప్పారు. ఏడాదికి మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలసి రూ.20వేలు అందిస్తుందన్నారు. సొంత భూమి గల రైతులకు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఎన్‌హెచ్‌పై స్తంభించిన ట్రాఫిక్



గన్నవరం: స్థానిక శ్రీనివాస హేచరీస్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల సమాచారం ప్రకారం...విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారు స్థానిక శ్రీనివాస హేచరీస్ వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను, ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కానప్పటికీ, కారు ముందు భాగం మాత్రం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం అనంతరం కారు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కేసీపీ కాలనీ ఫీడర్ మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. దీని కారణంగా 10 అడుగుల రోడ్డు, కేసీపీ కాలనీ, వీఆర్, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్:హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ డీఈ జీబీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బాపులపాడు, కె.సీతారామపురం, శేరినరసన్నపాలెం, మందడుగు కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

సర్కారు దొంగాట!

వక్ఫ్ భూములను కాపాడటంలో మీనమేషాలు

- కౌలు లీజు వేలంపై తాత్సారం
- కోర్టు ఆదేశాలు బేఖాతర్
- అక్రమంగా సాగు చేసిన పంట మాయం

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాలలో ఉన్న వక్ఫ్ భూముల కౌలు వేలం నిర్వహించే విషయంలో ప్రభుత్వం, అధికారులు దొంగాట ఆడుతున్నారు. వెంటనే వేలంపాట నిర్వహించాలని వక్ఫ్ బోర్డు అధికారులు జిల్లా, మండల అధికారులు చుట్టూ తిరుగుతూ అర్జీలు సమర్పిస్తున్నా స్పందన కనబడటం లేదు. మరో పక్క వక్ఫ్ భూముల్లో అక్రమ పంట సాగు చేసిన వ్యక్తులు పంట కోసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ విషయం..

కొండపల్లి ఖాజీ సర్వీస్‌కు చెందిన వక్ఫ్ భూమి పెదపులిపాక గ్రామం ఆర్ఎస్ నంబర్ 87లో 12.82 ఎకరాలు, తాడిగడప గ్రామం ఆర్ఎస్ నంబర్ 79,173,178లో 30.04 ఎకరాలు ఉంది. బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ. 300 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం, అధికారులు వైఖరి కారణంగా నేడు ఈ భూమి మనుగడ ప్రశ్నార్థంగా ఉంది. ప్రైవేటు వ్యక్తులు భూమిని ఆక్రమించి దందా చేస్తున్న ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదు.

అసలేమి జరిగిందంటే..

వక్ఫ్ భూమి ఒక బడాబాబు చేతుల్లో గత కొన్నేళ్ల కిందట చిక్కుకుంది. అతని సహకారంతోనే ఈ భూమిని అనధికారికంగా పలువురు వ్యక్తులు కౌలు చేస్తున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనాలు రావటంతో ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి వక్ఫ్ భూములకు కౌలు వేలంపాట నిర్వహించాలని ఉన్నతాధికారులను కోరారు. గత జనవరి 31వ తేదీన కౌలు వేలం నిర్వహిస్తామని పెనమలూరు తహసీల్దార్ జనవరి 21వ తేదీన ఆదేశాలు ఇచ్చారు. ఆ లోగా ఆక్రమణ దారులు హైకోర్టుకు వెళ్లగా కోర్టు కూడా వేలం నిర్వహించాలని జనవరి 30వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఎమ్మెల్సీ కోడ్ ఉందనే సాకుతో వేలం వాయిదా వేశారు. అయితే ఆక్రమణ దారులు చట్ట విరుద్ధంగా వక్ఫ్ భూముల్లో పంటలు సాగు చేశారు. దీనిపై వక్ఫ్ అధికారులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫిర్యాదు బుట్ట దాఖలైంది. హైకోర్టు ఆదేశాలను అధికారులు తుంగలో తొక్కారు.

వేలం ఎందుకు నిర్వహించరు..

ఇప్పుడు వక్ఫ్ భూముల వేలం ఎందుకు నిర్వహించటంలేదని ముస్లిం సంఘాల ప్రతినిధులు, ముస్లింలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. వక్ఫ్ బోర్డు సీఈవో, చైర్మన్, ఖాజీ, ఇన్‌స్పెక్టర్ జిల్లా కలెక్టర్‌ను కౌలు వేలం నిర్వహించాలని గత పది రోజుల కిందట కోరారు. వెంటనే చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చినా నేటికీ నిర్వహించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వేలం నిర్వహిస్తామన్న ప్రకటించిన అధికారులు నేడు ముఖం చాటేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పచ్చ గద్దల కారణంగానే వక్ఫ్ భూములు ప్రమాదంలో చిక్కుకున్నాయని ముస్లిం సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.



గతంలో అనధికారికంగా సాగు చేసిన వరి పంట



అదే పొలంలో పంట కోసేసిన దృశ్యం

పంట మాయం..

కాగా గత దాళ్వా సీజన్‌లో వక్ఫ్ భూముల్లో అక్రమంగా పంట సాగు చేసిన ఆక్రమణదారులు నేడు పంట కోసి అమ్ముకున్నారు. పంట అమ్మగా వచ్చిన సొమ్ములో నయాపైసా కూడా వక్ఫ్ బోర్డుకు రాలేదు.

వక్ఫ్ భూములు పరిరక్షించాలి..



అత్యంత విలువైన వక్ఫ్ భూములను ప్రభుత్వం పరిరక్షించాలి. ఓ బడా వ్యక్తి చేతుల్లో ఉన్న వక్ఫ్ భూమిని వక్ఫ్ బోర్డుకు స్వాధీనం చేయాలి. రెవెన్యూ అధికారులు కౌలు వేలం నిర్వహించక పోతే వక్ఫ్ బోర్డుకే అధికారం ఇవ్వాలి. వక్ఫ్ అధికారులు, ముస్లిం సంఘాల నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి. ఆక్రమణ దారులకు సహకరిస్తున్న అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి.

– సయ్యద్ ఇబ్రహీం, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు

దర్గాగా ఇరిగేషన్ స్థలం ఆక్రమణ

- టీడీపీ నాయకుని బరితెగింపు
- దర్గాగా పిల్లర్లు వేసి నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు



కాలువలోకి పిల్లరు వేసి సాగిస్తున్న నిర్మాణం

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో ఇరిగేషన్ స్థలాన్ని దర్గాగా ఆక్రమించి కట్టడం చేపట్టినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలోని పీఎస్ఆర్ కాలనీలో ఏలూరు కాలువ కట్టను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణం సాగిస్తున్నారు. రూ.లక్షలు విలువజేసే ఇరిగేషన్ స్థలంపై కన్నేసిన గ్రామ టీడీపీ నాయకుడు పట్టపు చంటి ఈ ఆక్రమణకు తెర లేపారు. ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న కేబుల్ పండు అనే వ్యక్తిని అడ్డం పెట్టుకుని తొలుత ఈ స్థలంలో మట్టితో మెరక తోలించారు. కాలువలోకి పునాదులు తీసి పిల్లర్లు నిర్మించారు. ఇసుక, ఇటుకలను డంప్ చేసుకుని ప్రస్తుతం గోడలు నిర్మిస్తున్నారు. ఇరిగేషన్ స్థలం ఆక్రమణకు గురవ్వడంతో ఈ ప్రాంతవాసులు అభ్యంతరం తెలుపగా ప్రభుత్వం మాది మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం అడగడానికి మీరెవరంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు పంచాయతీ అధికారులుగానీ, అటు ఇరిగేషన్ అధికారులు గానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఈ ఆక్రమణను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలని ధర్నా



వణుకూరులో వర్షపు నీటిలో రోడ్డు పై ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

పెనమలూరు:వణుకూరు–మద్దూరు ప్రధాన రహదారిని వెంటనే నిర్మించాలని లేని పక్షంలో నిరాహార దీక్ష చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాశిం డిమాండ్ చేశారు. వణుకూరు–మద్దూరు రోడ్డు పై మోకాలిలోతు నీటిలో శుక్రవారం సీపీఎం నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఖాశిం మాట్లాడుతూ గోసాల, వణుకూరు, మద్దూరు గ్రామాలతో పాటు విజయవాడ–అవనిగడ్డ కరకట్టకు వెళ్లే ప్రజలు ఈ రోడ్డు మీదగానే నానా ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారని తెలిపారు. అదే విధంగా జగనన్న కాలనీల్లో నివశిస్తున్న పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి ప్రస్తుతం చెరువులా మారినా కూటమి పాలకులు స్పందించటం లేదని విమర్శించారు. గత సంక్రాంతికే రోడ్లు వేస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ప్రగల్బాలు పలికారని ఆచరణలో మాత్రం రోడ్డుకు మోక్షం కలగలేదని తెలిపారు. గతంలో బోడెప్రసాద్ ఈ రోడ్డు బాగాలేదని సెల్ఫీలు దిగాడని ఇప్పుడు ఎమ్మెల్యే అయిన తరువాత ఆయన కనిపింటంలేదని ధ్వజమెత్తారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా మారిందన్నారు. ఇసుక లారీల కారణంగా రోడ్డు పై నడవలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ వెంటనే స్పందించి రోడ్డు నిర్మించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోట జోజి, జె.వెంకటేశ్వరరావు, మేడేపల్లి మహేష్, కాట్రగడ్డ నాగరాణి, మాదు నాగేశ్వరరావు, అనిల్, పి.సత్యనారాయణ, సీహెచ్.రాంబాబు, అన్నవరపు సభాపతి, దొడ్డప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

నున్న(విజయవాడరూరల్):గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనము, నవగ్రహయజ్ఞము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అనంతరం రుత్వికులు కుంభారాధన, ఉక్త హోమాలు నిర్వహించారు. పురాతనమైన ఈ ఆలయం జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠా కార్యక్రమం జరిగి పుష్కరకాలం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న అష్టబంధన మహాసంప్రోక్షణ (కుంభాభిషేక) కార్యక్రమాలకు గ్రామంలోని ప్రజలతో పాటు, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి అనుగ్రహం స్వీకరిస్తున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్య పరిరక్షణ



ఉప్పలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కంకిపాడు: పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్య పరిరక్షణ ముడిపడి ఉందని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఉప్పలూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంజు మాట్లాడుతూ డెంగీ రాకుండా దోమల నిర్మూలన, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల సహకారంతో దోమల నిర్మూలన చర్యలు సమర్థంగా సాగుతున్నాయన్నారు. ఫ్రైడే–డ్రైడే, డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వివి శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, పిహెచ్ఎన్ రాజమణి, సూపర్‌వైజర్ రామారావు, హెల్త్‌అసిస్టెంట్‌లు రాచమళ్ల శ్యాంప్రసాద్, కెనడీబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డిపోలో తహసీల్దారు తనిఖీలు



కేసరపల్లిలో రేషన్ డిపో తనిఖీ చేస్తున్న తహసీల్దారు

గన్నవరం:మండలంలోని కేసరపల్లి, గన్నవరంలోని రేషన్ దుకాణాలను శుక్రవారం తహసీల్దారు కె.వెంకటశివయ్య ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. తొలుత స్థానిక 12, 17 రేషన్ షాపులను సందర్శించిన ఆయన స్టాక్ రికార్డులను పరిశీలించారు. షాపులో మిగులు నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం కేసరపల్లిలోని 25, 27 రేషన్ షాపులను తహసీల్దారు పరిశీలించారు. రికార్డులు, స్టాక్ నిల్వలు సక్రమంగానే ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్లుగా చెప్పారు. కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భామనే... సత్యాభామనే...



భామాకలాపంలోని రసవత్తరమైన సన్నివేశం

విజయవాడ కల్చరల్: కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాక్షేత్రం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ కళాశాలలో శుక్రవారం యువ నృత్య కళాకారిణిలు శ్రావ్య గ్రీష్మ, కృష్ణ సునంద శ్రియ ప్రదర్శించిన భామాకలాపం నృత్యరూపకం ఆద్యంతం కూచిపూడి నృత్య వైభవాన్ని చాటింది. కూచిపూడి నృత్య సంప్రదాయంలో భామాకలాపం అతి ముఖ్యమైన సంప్రదాయ నృత్య రూపకం. శ్రీ కృష్ణుడు, సత్యభామల మధ్య జరిగిన అమలిన శృంగారం శ్రీ కృష్ణుని ప్రేమతత్వం, సత్యభామ అహంకారంతో కూడిన అభిమానం మధ్య జరిగిన సంఘర్షణే భామాకలాపం నృత్యరూపకం. సత్యభామగా శ్రావ్యగ్రీష్మ, శ్రీకృష్ణునిగా సునంద శ్రియ నృత్యాలను అభినయించారు. కార్యక్రమంలో నట్టువాంగం డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, గాత్రం సుధా శ్రీనివాస్, మృదంగం వెంపటి లక్ష్మణకుమార్, వయోలిన్ పాలపర్తి ఆంజనేయులు, ఫ్లూట్ కుమార్ బాబు సహకారం అందించారు. కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్యులు భాగవతుల శ్రీనివాస శర్మ, కురువి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్‌లను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



వణుకూరులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత

పెనమలూరు: కిశోరి బాలికలు రక్తహీనతకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. శ్రీలత తెలిపారు. వణుకూరు, గంగూరు, గోసాల సచివాయాల పరిధిలో శుక్రవారం క్యాంపు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. శ్రీలత మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలు రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రక్తహీనత నిరోధించటానికి ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఆకు కూరలు, చిక్కిలు, రాగి లడ్డు, రాగి జావ, ములగాకు, ఐరన్ బిల్లలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు జి.విజయలక్ష్మి, తబిత, డి.వికల్ప, ఎం.సుధారాణి, లిఖిత, ఏఎన్ఎంలు రేష్మ, మార్తమ్మ, రష్మి, అరుణ, పి.ఇందిరాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత వల్ల నష్టాలపై అవగాహన

ఉయ్యూరు రూరల్:కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బోళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం యుక్త వయసు బాలికల్లో రక్తహీనత లోపం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త ఇందిర రక్తహీనత వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. పోషకాహారంతో రక్తహీనత నివారించవచ్చని చెప్పారు. ఐరన్ ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఆహారంతోపాటు ఏదో ఒక పండు తినాలన్నారు. పాలు, ఆకుకూరలు, గుడ్లు, మొలకెత్తిన విత్తనాలతో పాటు రోజూ ఒక చిక్కి, విటమిన్ సి ఉండే నిమ్మ, నారింజ, ఉసిరి లాంటి పదార్థాలు తీసుకోవాలని సూచించారు. దీంతో బాడీలో ఐరన్ కంటెంట్ వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యులు, జొన్నల లావణ్య, ఏఎన్ఎం రోహిణి లక్ష్మి, ఆశా వర్కర్ సుజాత, అంగన్వాడి వర్కర్స్ జయచింత, కిశోర బాలబాలికలు పాల్గొన్నారు. కాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త ఝాన్సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ కంకిపాడు ఆకునూరు సెక్టార్ సూపర్‌వైజర్ బి.బేబి సరోజినీ పర్యవేక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, ఎన్. రజిని, లత, నిర్మల జ్యోతి, మెర్సికుమారి, అమల, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



విద్యుద్దీపాలంకరణలో అభయాంజనేయ స్వామి దేవస్థానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు దేవదాయ శాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. 22 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పితాని తారకేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజూ ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, ఆధ్యాత్మిక వేదికపై భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు ఉదయం సుప్రభాతసేవ, 1008 గులాబీ పూలతో ప్రత్యేక పూజ, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, కూచిపూడి నృత్యప్రదర్శన, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. 18వ తేదీన ఉదయం సుప్రభాతసేవ, 1008 మల్లి పూలతో ప్రత్యేక పూజ, సంప్రదాయ సంకీర్తనలు, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, మిమిక్రీ, రింగ్ డ్యాన్స్ ప్రదర్శన, సత్యహారిశ్చంద్ర నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. 19వ తేదీన ఉదయం సుప్రభాతసేవ, 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజ, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, డాన్స్ బేబి డాన్స్, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. 20వ తేదీన ఉదయం సుప్రభాతసేవ, 1008 లిల్లీ పూలతో ప్రత్యేక పూజ, భజనలు, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, కూచిపూడి నృత్య ప్రదర్శన, పూల రంగడు హాస్య నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. 21వ తేదీన ఉదయం సుప్రభాతసేవ, సప్త నదీజలాలతో నవ కలశ స్నపన, సర్వాలంకరణ, సింధూరార్చన, మన్యుసూక్త హోమం, లాంగూల పాశుపత హోమం, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, డాన్స్ బేబి డాన్స్, ఘంటసాల సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఉత్సవాల చివరి రోజైన 22న హనుమజ్జయంతిని పురస్కరించుకుని తెల్లవారుజాము 3 గంటలకు పంచామృత అభిషేకం, ప్రభాత సేవ, అర్చన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. కనుమూరి సూర్యనారాయణ రాజు కుటుంబీకుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలం పాట, అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వృద్ధుడు మృతి



కంకిపాడు: ప్రమాదవశాత్తూ వృద్ధుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...కంకిపాడు గ్రామానికి చెందిన పెన్నేరు రామచంద్రరావు (64) ట్రాక్టరు డ్రైవరుగా జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి ఉంటున్నాడు. అధికంగా మద్యం సేవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సమయంలో ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు గ్రామంలోని చెరువులో శవమై కనిపించాడు. మృతుడు మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

21న దేవదాయ భూములకు కౌలు వేలం

నున్న(విజయవాడరూరల్):నున్న గ్రామంలో దేవదాయశాఖకు చెందిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం భూములు 11.12 ఎకరాలు, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం భూములు 7.59 ఎకరాలు, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం భూములు 8.74 ఎకరాల వ్యవసాయ భూములను ఈ నెల 21వ తేదీన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మూడు సంవత్సరాల కాలపరిమితికి గాను కౌలు వేలం నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలత దేవి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు బిట్టుకు రూ.25 వేలు అడ్వాన్సు చెల్లించాలని కోరారు. గతంలో బకాయిలున్న వారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులని చెప్పారు. వేలంలో హెచ్చు పాటదారులు పాట మొత్తాన్ని అనగా ఒక సంవత్సరం ముక్తాను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం కార్యనిర్వాహణాధికారిని సంప్రదించాలని సూచించారు.

22న హనుమజ్జయంతి వేడుకలు

గన్నవరం రూరల్: ఈ నెల 22వ తేదీన హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. చిక్కవరం శ్రీ సూర్య ఆంజనేయ స్వామి వార్ల దేవాలయంలో ప్రత్యేక అలంకరణలు, అష్టోత్తర పూజలు, భజన నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామని నిర్వాహకులు చిట్టినేని వంశీ తెలిపారు.